క్లుప్తంగా

ఉగాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: ఉగాది పండుగను ఇంటి ల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే జోగురామన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలకు శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, ఏడాదంతా శుభం కలగాలని ఆకాంక్షించారు.

ట్రైకార్ చైర్మన్‌ను కలిసిన నాయకులు



ఇస్లావత్ రామచంద్రనాయక్‌తో నాయకులు

ఇంద్రవెల్లి: తెలంగాణ ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్, మేనేజర్ కుంజా శంకర్ రావ్‌లను కేస్లాపూర్ నాగోబా ఆలయ చైర్మన్ మెస్రం తుకారం, ఆదివాసీ నాయకులు హైదరాబాద్‌లో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ట్రైకార్ నిధుల ద్వారా నాగోబా ఆలయ పరిసర ప్రాంతంలో చెత్త పరిశుభ్రతకు ట్రాక్టర్‌తోపాటు టెంట్, ఫర్నిచర్ మంజూరు చేయాలని కోరినట్లు వారు తెలిపారు. ఎంపీటీసీ కోవ రాజేశ్వర్, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ కోరెంగా సుంగు, మాజీ ఎంపీటీసీ కనక హనుమంత్‌రావ్, దుర్వ ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

సైనిక్ స్కూల్‌లో జిల్లా విద్యార్థినికి సీటు



అభినందిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఏఆర్ పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వేణు కుమార్తె వాహినికి కోరుకొండ సైనిక్ స్కూల్‌లో సీటు లభించింది. తెలంగాణ రాష్ట్రానికి 6వ తరగతిలో ఉన్న ఒక్క సీటు విద్యార్థినికి రావడంపై ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అభినందించారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వాహినిని మిఠాయి తినిపించారు.

నష్టపరిహారం అందించాలని కలెక్టర్‌కు లేఖ

బోథ్: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కాంగ్రెస్ నాయకులు మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు లేఖ రాశారు. ప్రజాప్రతినిధులు పంటలను చూసి వెళ్తున్నారే తప్ప వారు రైతులకు ఆదుకోవడం లేదని, వారి మీద నమ్మకం లేదని లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖను ట్విట్టర్ ద్వారా కలెక్టర్, సీఎం కార్యాలయం, ప్రధానమంత్రి కార్యాలయానికి ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద లేఖలు పట్టుకుని నినాదాలు చేశారు. చంటి, మహేందర్, శేఖర్, రాజశేఖర్, గంగారెడ్డి, రమేశ్, అనిల్ ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఎదులాపురం: అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు జగన్‌సింగ్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వడగళ్ల వానకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో మిరప, మొక్కజొన్న, మామిడి, టమాటా పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఈ నష్టంపై ప్రభుత్వం సర్వే నిర్వహించాలన్నారు. గోపీచంద్, మధుకర్, ఉత్తం, నితీన్, వినోద్ ఉన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

నేరడిగొండ: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఆయన మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ప్లాంటేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులతోనే మానవుల మనుగడ సాధ్యమన్నారు. ఎంపీపీ రాథోడ్ సజన్, ఎఫ్ఆర్‌ఓ గణేశ్, మండల ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, అటవీ అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: అడవుల రక్షణ మానవ మనుగడకు ఎంతగానో దోహదపడుతాయని సిరిచెల్మ టైగర్‌జోన్ ఎఫ్ఆర్వో వాహబ్‌అహ్మద్ అన్నారు. సిరిచెల్మలో సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అటవీశాఖ సిబ్బందితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: అటవీ సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ అనిత అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ మంగళవారం కళాశాలలో ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేశారు. లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని జెడ్పీ సెకండరీ పాఠశాల ఆవరణలో ఎఫ్ఆర్‌వో పాండురంగ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య, ఎంపీడీవో చౌహాన్ రాధ, ఎంపీవో మహేందర్‌రెడ్డి, హెచ్‌ఎం ప్రత్యూష, బీట్ ఆఫీసర్లు ప్రీతం, వెంకటేశ్, వివేక్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రసాద్, హన్మండ్లు, జంగు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న జెడ్పీటీసీ అనిల్ జాదవ్

బోథ్: మండల కేంద్రంలోని జెడ్పీ సెకండరీ బాలుర పాఠశాలలో మొక్కలు నాటారు. ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ సంధ్యారాణి, అటవీశాఖ సెక్షన్ అధికారి సుందర్, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా వాగ్దేవి డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు అడవులను పెంచే విధంగా గ్రామాల్లో తిరుగుతూ గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కార్తీక్, దీప, ప్రవీణ్‌రెడ్డి, ముత్యం, సుధాకర్, ప్రవీణ్ కుమార్, ప్రశాంత్, శైలేందర్, కేదరినాథ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని మావల శివారు ప్రాంతంలో గల హరితవనం పార్కులో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అడవుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఉప న్యాస పోటీల్లో ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు అందజేశారు. అటవీ శాఖ అధికారులు ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

తపాలా బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

నార్నూర్: తపాలాశాఖ అందిస్తున్న జీవిత బీమా (పీఎల్ఐ), గ్రామీణ జీవిత బీమా (ఆర్‌పీఎల్ఐ) పథకాలు సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ అధికారి జి.రమేశ్ కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈనెల 15 నుంచి 24 వరకు జరిగే తపాలా బీమా పాలసీల మేళాపై మండలంలోని భీంపూర్ గ్రామంలో మంగళవారం ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఉద్యోగులను కలిసి బీమా పాలసీని వివరించారు. తపాలాశాఖ అందిస్తున్న సుకన్య సమృద్ధి, రికరింగ్ డిపాజిట్, సేవింగ్స్ ఖాతా, జీవిత బీమా పథకాల గురించి వివరించారు. బీపీఎంలు జాదవ్ చంద్రశేఖర్, అఖిల, లలిత, ప్రవీణ్, అనురాధ, సందీప్, రాథోడ్ మనోజ్ ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న తపాలాశాఖ అధికారి రమేశ్, సిబ్బంది

‘ఎమ్మెల్యేది అవగాహన రాహిత్యం’

ఆదిలాబాద్: ఎమ్మెల్యే జోగు రామన్న అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులపై బీజేపీ అనవసరంగా కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని అనడం సరికాదన్నారు. ఎమ్మెల్యే, మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించినా వ్యవస్థల గురించి తెలియకపోవడం శోచనీయమన్నారు. బీఆర్ఎస్ నాయకులు దర్యాప్తు సంస్థలకు భయపడుతూ అనవసరపు వ్యాఖ్యలు చేస్తూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో బీజేపీ పాత్ర ఉందని మాట్లాడుతుండడం అందులో భాగమేనన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు జోగు రవి, దినేష్ మటోలియా, వేణుగోపాల్, లోక ప్రవీణ్ రెడ్డి, ఆకుల ప్రవీణ్, సోమరవి, రత్నాకర్ రెడ్డి, రాజేష్, సంతోష్, శ్రీనివాస్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాలిబూడిదైన స్క్రాప్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) శివారు ప్రాంతంలో గల అట్టల స్క్రాప్ గోదాంలో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. అగ్నిమాపక శాఖ అధికారి శివాజీ మాట్లాడుతూ సమీపంలో చెత్తను కాల్చుతుండగా మంటలు వ్యాపించి అట్టల స్క్రాప్ గోదాంకు అంటుకున్నాయన్నారు. అక్కడ నిల్వ ఉన్న అట్టలు కాలి బుడిదయ్యాయన్నారు. వీటి విలువ రూ. లక్ష వరకు ఉంటుందన్నారు.



మంటలార్పుతున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

సెర్ప్ ఉద్యోగుల సంబరాలు



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, సెర్ప్ ఉద్యోగులు



రిజ్వాన్ భాషా షేక్‌ను సన్మానిస్తున్న సెర్ప్ ఉద్యోగులు

నేరడిగొండ: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం వద్ద మంగళవారం సెర్ప్ ఉద్యోగుల సంబరాలు జరుపుకున్నారు. జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్, ఐకేపీ ఏపీఎం ఉత్తంలతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్‌తో కూడిన వేతనం అందించేందుకు సీఎం కేసీఆర్ జీవో నం.11 విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కాగా జెడ్పీటీసీ, ఎంపీపీలకు శాలువతో సత్కరించారు. బోథ్ ఏఎంసీ మాజీ చైర్మన్ దావుల భోజన్న, ఐకేపీ సీసీలు పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్‌కు సన్మానం

కైలాస్‌నగర్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో పనిచేసే ఉద్యోగులకు జీవో నెంబర్ 11 ద్వారా పే స్కేల్‌ను అమలు చేయడంపై సెర్ప్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ మంగళవారం జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్‌ను సెర్ప్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సన్మానించారు. మిఠాయిలు తినిపించారు. అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు సీఎం కేసీఆర్ పేస్కేల్‌ను ప్రకటించడం హర్షనీయమన్నారు. ఏపీడీ అర్క చరణ్‌దాస్, డీపీఎంలు బిట్ల గంగన్న శోభారాణి, హేమలత, శోభారాణి, సుగంధ, ఏపీఎంలు శుద్ధోద్దిన్, సంతోష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వాల వైఖరితోనే రైతుల ఆత్మహత్యలు’

ఉట్నూర్: ప్రభుత్వాలు అవలంబిస్తున్న వైఖరితోనే రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు పూసం సచిన్ అన్నారు. స్థానిక ప్రెస్‌భవన్‌లో మంగళవారం అయన సీపీఎం జన చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు కనీసమద్దతు ధర కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అవుతున్నాయన్నారు. రైతుల పట్ల అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 24 నుంచి ఉమ్మడి జిల్లాలో సీపీఎం ఆధ్వర్యంలో జన చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కిష్టప్ప, సోమేశ్, స్వామి, మాల్కు, ఈశ్వర్ పాల్గొన్నారు.

ఆస్పత్రులు, క్లీనిక్‌లలో తనిఖీలు చేపట్టాలి

ఎదులాపురం: పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులు, క్లీనిక్‌లపై ప్రత్యేక తనిఖీ చేపట్టాలని సార్క్ నేషన్స్ ఇంటర్ నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్ గుర్రం పున్నంరావు, ప్రధాన కార్యదర్శి నీరటి ఉదయ్ కిరణ్‌లు డీఎంహెచ్‌వోను కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఈ మేరకు జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్‌ను కలిపి వినతిపత్రం అందజేశారు. రిజిస్ట్రేషన్, లైసెన్స్ లేకుండా క్లీనిక్‌లు నడుపుతున్నారని, ఆయుర్వేద హోమియోపతి డాక్టర్లు సర్జరీలు నిర్వహిస్తున్నారని విన్నవించారు. అలాగే కొంతమంది వైద్యులు డ్యూటీ వేళల్లో ప్రభుత్వ ఆస్పత్రులు వైద్య సేవలు అందించకుండా సొంతంగా క్లీనిక్‌లు నడుపుతున్నారని అన్నారు. ఈ విషయంలో వెంటనే తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

ఆదిలాబాద్: టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్లో నిరుద్యోగుల నుంచి ఈ మేరకు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లీకేజీ వ్యవహారంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సీబీఐతో సైతం న్యాయ విచారణ జరిపించాలన్నారు.

‘ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి’

ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను బీజేపీ నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి సూచించారు. ఇటీవల నూతనంగా నియమితులైన బీజేపీ ఓబీసీ మోర్చా ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటి సతీశ్, తోకల నరేశ్‌ను పట్టణంలోని ఆమె కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. గొర్ల రాజు యాదవ్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

టాయిలెట్లు అందుబాటులోకి తీసుకురావాలి

జైనథ్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొత్తగా నిర్మించిన టాయిలెట్లను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని సుహాసినిరెడ్డి అన్నారు. మంగళవారం ఆమె జెడ్పీ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడారు. ఉప సర్పంచ్ రాకేశ్‌రెడ్డి, నాయకులు అశోక్ రెడ్డి, అశీష్‌రెడ్డి, సబ్దార్ ఉన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ఆదిలాబాద్‌రూరల్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం అగర్వాడ గ్రామానికి చెందిన జుగ్నాక్ రేణుక మృతికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు గొడం రేణుక డిమాండ్ చేశారు. మంగళవారం మావల మండలంలోని బట్టిసావర్గాం శివారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ యువతి మృతిపై విచారణ జరిపించాలన్నారు. నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆమె మృతిచెందితే కనీసం పోస్టుమార్టం చేయకుండా మృతదేహాన్ని ఎలా తీసుకొస్తారని ప్రశ్నించారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరా, గంగాదేవి, కుమ్ర శాంతబాయి, మహేశ్వరి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: రేణుక మృతికి కారుకుడైన నిందితులను వెంటనే ఉరితీయాలని తుడుందెబ్బ మండల అధ్యక్షులు జుగానక్ భరత్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పుర్క చిత్రు, భరత్, మురహరి, మాణిక్‌రావ్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బేల: గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ పేర్కొన్నారు. మండలంలోని దహెగాం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రూ.50 లక్షల వ్యయంతో మంగళవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఎంపీపీ శాక్రే వనిత గంభీర్, సర్పంచ్ వరాడే అంబుతాయి విఠల్ పాల్గొన్నారు.

26న సీపీఐ సర్వసభ్య సమావేశం

ఎదులాపురం: మంచిర్యాలలోని నస్పూర్ న్యూ కమ్యూనిటీ హాల్లో ఈనెల 26 నిర్వహించనున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీపీఐ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశానికి పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేని శంకర్ హాజరవుతున్నట్లు వెల్లడించారు. నలినిరెడ్డి, అరుణ్ కుమార్, రాములు, రమేశ్, గణేశ్, సురేశ్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన జెడ్పీటీసీ

నేరడిగొండ: రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డిని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ మంగళవారం నిర్మల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు అందించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇటీవల వడగళ్ల వర్షంతో పంటలు దెబ్బతిన్నాయని, నష్టపోయిన రైతులకు పరిహారం అందించేలా చూడాలన్నారు. ఆయన వెంట ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, ఆల్వే శేఖర్, జాదవ్ ధన్ రాజ్, కిరణ్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

నార్నూర్: గాదిగూడ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన దుర్వా లక్ష్మణ్‌ను వైస్ ఎంపీపీ యోగేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అడ రాజులు మంగళవారం సన్మానించారు.

జన చైతన్య సభను విజయవంతం చేయాలి

జైనథ్: జిల్లాకేంద్రంలో ఈనెల 23న నిర్వహించే జన చైతన్య యాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పూసం సచిన్ కోరారు. మండలంలోని బెల్లూరి గ్రామంలో మంగళవారం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ఆదివాసీ, ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు, రాష్ట్ర నేతలు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలని కోరారు.

మహిళా పేరిట స్టేడియం అభినందనీయం

ఎదులాపురం: దేశంలో ఓ మహిళా క్రీడాకారిణి పేరిట స్టేడియం ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. హాకీ క్రీడాకారిణి రాణి రాంపాల్ పేరిట రాయ్‌బరేలీలో స్టేడియం ఏర్పాటు చేయడం పట్ల ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు.

నీటి వనరులను సంరక్షించాలి

ఆదిలాబాద్‌టౌన్: భావితరాలకు నీటి వనరులు అందించేలా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్ అన్నారు. మంగళవారం కళాశాలలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

24న కలెక్టరేట్ ఎదుట నిరసన

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం సుగుణ అన్నారు. మంగళవారం సుగుణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అన్నిబిల్లులను ఈనెల నెల 31లోగా చెల్లించాలని ప్రతి నెల 1న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు.

రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండల కేంద్రానికి చెందిన బద్దం ప్రశాంత్ రెడ్డి వెన్నుముక విరగడంతో ఆపరేషన్ చేయాలని ×ఓ౯ పాజిటివ్ రక్తం అవసరమైంది. కుటుంబీకులు యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రెటరీ సామ రూపేష్ రెడ్డిని సంప్రదించగా, ఆయన జైనథ్ మండలం సాంగి గ్రామానికి చెందిన రాకేశ్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన ఆదిలాబాద్ రిమ్స్‌లో రక్తదానం చేశారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

తాంసి: భీంపూర్ పీహెచ్‌సీలో మంగళవారం గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. గిరిగాం ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని 19 మంది గర్భిణులకు వైద్యాధికారి నిఖిల్‌రాజ్ ఆధ్వర్యంలో రక్త, బీపీ పరీక్షలు చేశారు. వైద్యసిబ్బంది జ్ఞానేశ్వర్, గంగాధర్, ల్యాబ్ టెక్నిషియన్ శ్రీదేవి, ఏఎన్ఎంలు ఉన్నారు.

వైన్స్ షాపును వేరే చోటికి తరలించాలి

తలమడుగు: మండల కేంద్రంలోని వైన్స్ షాపును వేరేచోటకు తరలించాలని గ్రామానికి చెందిన దత్తు యాదవ్, పద్మాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎక్సైజ్ అధికారులు, పోలీసులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఇళ్ల మధ్యలో వైన్స్ షాప్ ఉండడంలో మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారని అన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తిని శుభ్రం చేయించిన నాయకులు

బోథ్: సొనాల గ్రామంలో ఊరె రవి మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. బీఆర్ఎస్ నాయకులు అతనికి క్షౌ వరం తీయించి స్నానం చేయించారు. నూతన వస్త్రాలు ఇచ్చారు. మండల కోఆప్షన్ సభ్యుడు మహిమూద్, ఏఎంసీ డైరెక్టర్ అమృత్‌రావ్ పాటిల్, సొసైటీ డైరెక్టర్ లోలపు పోశెట్టి, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు మునేశ్వర్ సోమన్న, రాజారాం, పరమేశ్వర్ ఉన్నారు.

బెల్టులు, టై అందజేత

బోథ్: కనుగుట్టలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హెచ్‌ఎం రాకేశ్, ఉపాధ్యాయులు చిలుక సతీశ్ తమ స్వంత ఖర్చులతో బెల్టులు, టైలు అందజేశారు. వీవీలు మౌనిక, పూజ ఉన్నారు.

రజక కూలీ ధరల పెంపు

ఆదిలాబాద్‌రూరల్: ప్రతిఏడాది మాదిరిగానే ఈ ఏడాది ఉగాది నూతన సంవత్సరం సందర్భంగా జంటకు రజకుల కూలీ ధర రూ.3 వేలకు పెంచినట్లు రజక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జంటకు అందజేస్తున్న ధరలు సరిపోకనే వాటిని పెంచినట్లు తెలిపారు. అశోక్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

ఆదిలాబాద్‌టౌన్: ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫర్హా అన్నారు. పట్టణంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో అవగాహన ర్యాలీ చేపట్టారు. అంతకుముందు అంగన్‌వాడీలతో ప్రతిజ్ఞ చేయించారు.

ఇచ్చోడ: చిరుధాన్యాలపై బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించాలని సీడీపీవో సౌందర్య అన్నారు. మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 20 నుంచి ఏప్రిల్ 3 వరకు నిర్వహించే పోషణ పక్షోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అబ్దుల్, నాగలక్ష్మి, ఉమారాణి, పాల్గొన్నారు.

తాంసి: భీంపూర్ మండలం పిప్పల్‌కోటిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడాలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో నర్సమ్మ పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి, గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ కళ్యాణి, సూపర్‌వైజర్ ముంతాజ్ ఉన్నారు. అలాగే తాంసిలోని అంగన్‌వాడీ గ్రామస్తులు వైద్య సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు.

ఓబీసీ కోఆర్డినేటర్ల నియామకం

బోథ్: ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు బీజేపీ ఓబీసీ కో ఆర్డినేటర్లను జిల్లా అధ్యక్షుడు రాజు యాదవ్ మంగళవారం నియమించారు. తూము సూర్యం, తదితరులు ఉన్నారు.

మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజ్ మహమ్మద్

బోథ్: బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా మర్లపెల్లి గ్రామానికి చెందిన రాజ్ మహమ్మద్ షేక్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షులు నియామక పత్రాన్ని అందించారు.

ఆడబిడ్డలకు అండగా సీఎం కేసీఆర్



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

బోథ్: ఆడబిడ్డలకు అండగా సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. బోథ్, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ మండలాలకు చెందిన లబ్ధిదారులకు రూ.1.41 కోట్లు విలువ గల 104 చెక్కులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సంధ్యారాణి, నేరడిగొండ ఎంపీపీ సజన్, ఏఎంసీ చైర్మన్ రుక్మన్ సింగ్, వైస్ ఎంపీపీ లింబాజీ, బిఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్, సర్పంచ్ సురేందర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాహెర్ బిన్ సలాం, రైతుబంధుసమితి అధ్యక్షుడు జగన్ రెడ్డి, ఆత్మ చైర్మన్ సుభాష్, మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజు ఉన్నారు.

తలమడుగు: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. మండలంలోని ఉండమ్ గ్రామంలో కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో రమకాంత్, సర్పంచ్ కంది పోచ్చుబాయి, బోథ్ అధికార ప్రతినిధి మెట్టె కిరణ్‌కుమార్, కన్వీనర్ వెంకటేశ్, గంగధార్ సర్పంచులు మహేందర్ యాదవ్, పోతారెడ్డి పాల్గొన్నారు.

‘ఉత్తమ అవార్డు రావడం గర్వంగా ఉంది’

ఇంద్రవెల్లి: మండలంలోని ఏమాయికుంటకు జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు రావడం గర్వంగా ఉందని సర్పంచ్ జాదవ్ లక్కన్ అన్నారు. ఉత్తమ అవార్డు వచ్చిన సందర్భంగా గ్రామంలో వార్డు సభ్యులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాల విభాగంలో జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డు వచ్చినట్లు తెలిపారు. కార్యదర్శి విజయ్‌కుమార్, గ్రామస్తులు ఆరెల్లి రాందాస్, అశోక్, ప్రేమ్‌కుమార్, జగన్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలాజైన్ అన్నారు. మండలంలోని పొచ్చర గ్రామంలో జెడ్పీ సెకండరీ పాఠశాలలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశ చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. విద్యార్థుల లక్ష్యం నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి గంగారాం, అశోక్, ఉమేశ్, హెచ్‌ఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తిరుపెల్లి రామ్ మందిర్ సమీపంలో వైదిక పురోహిత అర్చక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. సంతోష్ కుమార్ శర్మ, రాధాకృష్ణ శాస్త్రి, కిశోర్, గుండయ్య, ఆదినారాయణ, ప్రదీప్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
CHANGE OF NAME
Mohammad Gouse Baba, S/o Mohammad Ashraf, R/o 2-5-219/1, nowgaam basthi, word-20, kagaznagar, Adilabad, Andhra pradesh - 504296, have changed my name to Mohammad Adil for all future purposes [QA-1774]

BUSINESS OFFER
Capro కంపెనీ ప్రైవేట్ అన్ని రకము లైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను. మంచి జీతం + కమీషన్. ✆ 9319814720. [T-1196145]

www.sakshi.com

WANTED
హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం, జీ:16K, ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9640258899. [H-786849]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినోద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899